# అసంపూర్తిగా వదిలేశారు..

- ప్రజాధనం నిరుపయోగం
- డంపింగ్‌యార్డ్‌లా 'గొల్లనపల్లి' రోడ్డు
- కంప చెట్లతో అధ్వానంగా..


వృక్షాలతో గొల్లనపల్లి-సూరంపల్లి రోడ్డు


గొల్లనపల్లి వద్ద ప్రారంభమైన పోలవరం రైట్ కెనాల్ నాలుగు లైన్ల రోడ్డు

గన్నవరంరూరల్: కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారి డంపింగ్‌యార్డ్‌గా మారింది. గన్నవరం మండలంలోని గొల్లనపల్లి పోలవరం వంతెన వద్ద నుంచి సూరంపల్లి వరకు గతంలో కోట్లు ఖర్చు చేసి నాలుగు లైన్ల రోడ్డు నిర్మించారు. ఇది పూర్తవ్వకపోవడంతో అది డంపింగ్ యార్డుగా మారింది. కంప చెట్లతో అడవిని తలపిస్తోంది. తాగుబోతులకు ఓపెన్ బార్ అయ్యింది. అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది.

### ప్రశ్నార్థకంగా..

3 నుంచి 4 కిలో మీటర్ల దూరం నిర్మించిన నాలుగు లైన్ల రోడ్డు ప్రశ్నార్థకంగా మిగిలింది. ఈ రోడ్డు ఒక వైపు గొల్లనపల్లి, గోపవరపుగూడెం, ముదిరాజుపాలెం, కట్టుబడిపాలెం, సూరంపల్లి గ్రామాలను ఆనుకుని ఉంది. మరోవైపు పోలవరం కుడి కాలువ ఉంటుంది. ఈ రెండింటి మధ్య అప్పట్లో రోడ్డు నిర్మాణం చేశారు. మధ్యలో డివైడర్ కూడా నిర్మించారు.

### రైతుల ఆశలు వమ్ము

ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట భూములు కోట్లు ఖరీదు చేస్తాయి. రోడ్డు నిర్మాణంతో ఆ భూముల ధరలకు మరింతగా రెక్కలు వచ్చాయి. ఇప్పుడు ఈ రోడ్డు నిరుపయోగంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజల ఆశలు నీరుగారాయి.

### ప్రత్యామ్నాయ రహదారిగా

కొండపావులూరు 6లో ఉన్న ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ జవాన్లు సైతం వెంటనే రెస్క్యూ ఆపరేషన్‌లకు వెళ్లాలంటే ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రత్యామ్నాయ రహదారిగా ఉంది. ఎన్‌డీఆర్‌ఎఫ్ నుంచి ఇంజినీరింగ్ కాలేజీ మీదుగా ఈ రోడ్డుకు చేరుకోవచ్చు. కట్టుబడిపాలెం పోలవరం వంతెన, పక్కనే ఉన్న ఎర్ర చెరువు రోడ్డు ఆ వెంట మామిడితోటలు ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి మామిడి ఎగుమతులు బయటకు వెళ్లే రాజ మార్గంగా ఈ రోడ్డు ఉంది. ఎన్‌డీఆర్‌ఎఫ్ రోడ్డు నుంచి కట్టుబడిపాలెం పోలవరం వంతెన వరకూ లింక్ రోడ్డు నిర్మాణమైతే ఈ రోడ్డు ఉపయోగపడుతుందని రైతులు ఆశపడ్డారు. అయితే ఆశలు అడియాసలయ్యాయి. సూరంపల్లి, మాదలవారిగూడెం గ్రామాల్లో 120 ఇటుక బట్టీలు ఉన్నాయి. వీటి నుంచి లక్షల ఇటుకలు నిత్యం తరలిస్తుంటారు. ఒక వైపు వ్యవసాయం మరోవైపు వ్యాపారం, ఇంకో వైపు రవాణాకు ఉపయోగపడే రోడ్డు నిరుపయోగంగా ఉంది. సూరంపల్లి పోలవరం వంతెన వద్ద నుంచి గొల్లనపల్లి పోలవరం కాలువ వంతెన వరకు నిర్మించిన రోడ్డును బాగుచేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి పరుగులు తీస్తుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కంప చెట్లతో మూసుకుపోయిన రోడ్డు

#### కంప తొలగించాలి, రోడ్డు బాగుచేయాలి



ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం ప్రగతి సాధిస్తుంది. బంగారం లాంటి నాలుగు లైన్ల రోడ్డు నిరర్థకంగా వదిలివేశారు. కంప చెట్లు తొలగిస్తే రోడ్డు స్వరూపం ఎంతో బాగుంటుంది. అధికారులు రోడ్డు మెయింటెనెన్స్ చేపట్టాలి.

–దేవరపల్లి రామారావు, గోపవరపుగూడెం, రైతు

#### కోట్లు ఖర్చు చేశారు ఉసూరుమనిపిస్తోంది



ఈ రోడ్డు నిర్మాణంతో ఎంతో సంతోషించాం. కానీ అనంతర కాలంలో డంపిగ్ యార్డుగా మారిపోయింది. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రోడ్డును చూస్తే ఉసూరుమనిపిస్తుంది. నున్న, ఆగిరిపల్లి, విజయవాడ రాకపోకలకు ఎంతో ఉపయోగపడే రోడ్డు కంపతో నిండి ఉంది. పోలవరం యూటీల వద్ద మలుపులు బాగజేసి రోడ్డు వేస్తే ఎంతో మేలు కలుగుతుంది. ముఖ్యంగా వ్యవసాయానికి, రైతులకు మంచి జరుగుతుంది. కంప, వ్యర్థాలు తొలగిస్తే మెట్ట గ్రామాలకు మణిహారం అవుతుంది.

–కాటూరు బాబూరావు, గోపవరపుగూడెం, రైతు

### చెత్త, వ్యర్థాలతో నిండి

డంపింగ్ యార్డుగా ముళ్లకంపలతో నిండిన రోడ్డు ఆయా గ్రామాల ప్రజలకు డంపింగ్‌యార్డ్‌గా మారింది. ఎక్కడెక్కడ చెత్త తెచ్చి ఇక్కడ పడేస్తున్నారు. పోలవరం కాలువ వెంట, డివైడర్ మధ్యలో, రోడ్డు వెంట, మొలిచిన కంప రోడ్డును మూసివేసింది.

### గతంలోనే అధికారులకు వినతి

ఇందిరా సాగర్ రైట్ కెనాల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు సూరంపల్లి రైతులు ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, అండర్‌టన్నెల్స్ వద్ద సాగునీటి మార్గాలు, రోడ్డు పూర్తి చేయాలని 8 చోట్ల ఇరిగేషన్ కల్వర్టులు పూర్తి చేయాలని గతంలోనే కోరారు.

## క్లుప్తంగా

### ఉచిత టైలరింగ్ శిక్షణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులోని శ్రీసత్యసాయి మందిరంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థ, యూనియన్ బ్యాంక్‌కు చెందిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఆర్‌ఎస్‌ఈటీఐ) సంయుక్త ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవా సంస్థ జిల్లా కన్వీనర్ కొమరగిరి చంద్రశేఖర్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. బాపులపాడు వైస్ ఎంపీపీ చందు రమాదేవి, మాజీ సర్పంచ్ గరికపాటి రామకృష్ణ, ఉప సర్పంచ్ గరికపాటి పుల్లయ్య, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు బెక్కం వెంకటేశ్వరరావు, నాంచారయ్య, కొండలరావు పాల్గొన్నారు.

### అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: శ్రీ స్రవంతికృష్ణ ఎంటర్‌టైనర్స్, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో సినీ సంగీ విభావరి కార్యక్రమంలో భాగంగా గురువారం హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకుడు స్రవంతి కృష్ణ ఆధ్వర్యంలో సుశీల్‌కుమార్, విజయ్, శివలీల, బెల్లంకొండ భారతి, స్వాతీ మీరాకుమార్, బన్నీ పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. గాయకుడు స్రవంతి కృష్ణ మాట్లాడుతూ గాయనీ గాయకులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి నెల విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు.

### కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలి



విజయవాడకల్చరల్: సాంస్కృతిక కళా సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. సమతాసేవా సమితి 14వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు చారిత్రక పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డికి గండపెండేర ధారణం, రంగస్థలానికి చెందిన గాజులపల్లి ఫరీద్‌కు రజిత హస్తకంకణ ధారణ కార్యక్రమం నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ కళాకారులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

**ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం**

విశ్రాంత ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్ సమతాసేవా సమితి నిర్వహించే కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన గోళ్ల నారాయణరావు, డాక్టర్ పీవీఎన్ కృష్ణ, బోడి ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు. సమతాసేవా సమితి నిర్వాహకుడు చింతా వెంకటేశ్వర్లు నిర్వహించారు. చింతా దూండీ కృష్ణ దుర్యోధనుడుగా, శ్రీ కృష్ణునిగా గుమ్మడి విమలకుమారి శ్రీ కృష్ణరాయబారంలోని ఓ సన్నివేశాన్ని ప్రదర్శించారు. కొండవీటి వేద హాసిత ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

### తండ్రిపై దాడి చేసిన కుమారుడికి జరిమానా

ఉంగుటూరు: తండ్రిపై దాడికి పాల్పడిన కుమారుడికి రూ.7 వేల జరిమానా విధిస్తూ గన్నవరం కోర్టు గురువారం తీర్పునిచ్చింది. ఎస్‌ఐ యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం లంకపల్లి గ్రామానికి చెందిన గంట సంజీవరావుపై తన కుమారుడు సుధీర్ బాబు దాడికి పాల్పడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసిన ఎస్‌ఐ రాజు నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఏపీపీ మాధవీలత వాదనలను వినిపించారు. నేరం రుజువుకావడంతో జడ్జి నిందితుడికి రూ.7వేలు జరిమానా విధించారు.

# ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

**పెనమలూరు నియోజకవర్గంలో 69.44 శాతం పోలింగ్**

కంకిపాడు/ఉయ్యూర్/పెనమలూరు: పట్టభద్రులు ఓటెత్తారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పెనమలూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు. 10,760 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 69.44 శాతం పోలింగ్ నమోదైంది. తాడిగడప మున్సిపాలిటీలో ఎనిమిది, పెనమలూరులో మూడు, కంకిపాడులో మూడు, ఉయ్యూరులో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 15,495 మంది పట్టభద్రులు ఉండగా వీరిలో పురుషులు 8,498 మంది, మహిళలు 6,995 మంది ఓటర్లు, ఇతరులు ఇద్దరు ఉన్నారు.

**తొలుత మందకొడిగా..**

తొలుత ఓటింగ్ శాతం మందకొడిగా ఉన్నా పది గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ కట్టారు. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. 15,495 మంది ఓటర్లకు 10,760 మంది ఓటర్లు తమ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు**

పెనమలూరు మండలంలో 10594 ఓట్లకు 7225 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 4048 మంది, మహిళలు 3177 మంది ఉన్నారు. కంకిపాడు మండలంలో 2096 మంది ఓటర్లకు 1526 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 831 మంది, మహిళలు 695 మంది ఉన్నారు. ఉయ్యూరు మండలంలో 2805 మంది ఓటర్లుగానూ 2009 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 1086 మంది, మహిళలు 923 మంది ఉన్నారు.

**ఎస్పీ పరిశీలన**

ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ నియోజకవర్గంలోని ఉయ్యూరు, కంకిపాడు, పెనమలూరు ప్రాంతాల్లో పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఉయ్యూరు సీఐ రామారావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్‌ఐ విశ్వనాథ, కంకిపాడు సీఐ మురళీకృష్ణ, అదనపు ఎస్‌ఐ తాతాచార్యులు పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద తమ్ముళ్ల హల్‌చల్**

పోలింగ్ కేంద్రాల వద్ద తెలుగు తమ్ముళ్లు హల్‌చల్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పసుపు కండువాలు కప్పుకుని, ఆయా గ్రామాల నుంచి పట్టభద్రుల ఓటర్లను పలకరిస్తూ ప్రభావితం చేసే యత్నం చేశారు. 'గుర్తుందా...ఎవరికో' అంటూ ఓటర్లను పోలింగ్ కేంద్రాల పలకరిస్తూ అధికారదర్పం ప్రదర్శించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, అధికారులు ఆవైపు కన్నెత్తి చూడకుండా అధికారపక్షానికి కొమ్ము కాశారనే ఆరోపణలు వినిపించాయి.


రామవరప్పాడు ఎంపీపీ స్కూల్‌లో ఓటర్లు

**రామవరప్పాడు**: రామవరప్పాడు ఎంపీఎంపీ స్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాలు, ప్రసాదంపాడు ఏపీ సీడ్స్‌లో ఒక పోలింగ్ కేంద్రంలో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**నున్న(విజయవాడరూరల్)**: నున్న జెడ్పీ స్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని ఏడీసీపీ జి. రామకృష్ణ, ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఎంపీడీఓ) పి.మురళీకృష్ణప్రసాద్ పరిశీలించారు.

**గన్నవరం మండలంలో 70.35 శాతం పోలింగ్**

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ స్టేషన్లలో ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఉదయం నుంచి ఓటుహక్కును వినియోగించుకునేందుకు పట్టభద్రులైన యువత మొత్తంగా 70.35 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ కె. వెంకటశివయ్య తెలిపారు. పురుషులు 1,361, మహిళలు 1,121 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రం ప్రధాన ద్వారం పక్కనే టెంట్ వేసి ఆ పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మద్దతుగా బహిరంగంగా ప్రచారం చేసినా అధికారులు పట్టించుకోపోవడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియను గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు, పలువురు అధికారులు పరిశీలించారు.

**ఉంగుటూరు**: ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్లో 129, 130 నంబర్లతో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో పట్టభద్రులు 1,234మంది ఉండగా 840మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం, పంచాయతీరాజ్ జేఈ శ్రీనివాసరావు పరిశీలించారు. తహసీల్దార్ జాలాది విమలకుమారి, ఉంగుటూరు ఎస్‌ఐ యు.గోవిందు పర్యవేక్షించారు.


వీల్‌చైర్‌పై వచ్చి ఓటు వేసిన వృద్ధుడు


కంకిపాడులో పోలింగ్ కేంద్రం వద్ద ఎస్పీ గంగాధరరావు


ఉయ్యూరు పోలింగ్ కేంద్రానికి ఓటు వేయడానికి వచ్చిన న్యాయమూర్తి కె.శ్రీహరి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. మండలంలో 2,628 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా 1,906 ఓట్లు పోలయ్యాయి. 72.52 శాతం పోలింగ్ నమోదైనట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. జంక్షన్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు.


ఉయ్యూరు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


గన్నవరంలో ఓటు వేసేందుకు బారులుతీరిన ఓటర్లు

## లిల్లీ పూలతోట పరిరక్షణకు చర్యలు


గోసాలలో పూలతోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త మంజువాణి

పెనమలూరు: రైతులు లిల్లీ పూల తోటలను పరిరక్షించుకోవడానికి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి అన్నారు. ఆమె గురువారం మండల ఉద్యానవన అధికారి చందుజోసెఫ్‌సుందరంతో గోసాల, వణుకూరులో లిల్లీ పూలతోటలు, కూరగాయతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి వివరాలు తెలుపుతూ లిల్లీ పూలతోటల్లో పెంకుపురుగు( బ్లాసం మిడ్జ్ పురుగు) ఆశించడాన్ని గమనించామన్నారు. ఈ పురుగు మొగ్గదశలో గుడ్లు పెడతాయన్నారు. పొదిగిన లార్వా పూలను తినడంతో పూలు విచ్చుకున్న సమయంలో గోధుమ రంగులో మారి కుళ్లి పోవడం, వంకర్లు తిరుగుతాయన్నారు. 4 నుంచి 5 రోజుల తర్వాత ఎదిగిన లార్వా దూకి తేమ ఉన్న మట్టిలో గూడుకట్టుకుని ప్యూపాగా మారుతుందన్నారు. పది రోజుల్లో తల్లి పురుగులా మారి బయటకువస్తుందన్నారు. ఈ పురుగులు నివారణకు ఆశించిన కాడలను కోసి మంటలో కాల్చాలన్నారు.

భూమి పై అధిక తేమ లేకుండా చూసుకోవాలని, సాళ్ల మధ్య బ్లాక్ పాలథీన్ మచ్ వేసుకుంటే ప్యూపా దశను అరికట్టవచ్చని వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన అధికారి చాముండేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

## కనులపండువగా గ్రామోత్సవాలు

పెనమలూరు: యనమలకుదురులో గురువారం స్వామివారి గ్రామోత్సవం ఘనంగా చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణం బుధవారం అర్ధరాత్రి ఘనంగా చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామ మండపం వద్దకు తీసుకు వచ్చారు. ఆలయ పూజారి సాగర్ స్వామివార్లకు పూజలు చేసిన తర్వాతగ్రామోత్సవం ప్రారంభించారు. కల్యాణం చేసిన భక్తులు అయోధ్య శ్రీనివాసరావు, లక్ష్మీనరసమ్మ కొబ్బరికాయ కొట్టి స్వామివారికి హారతులు ఇచ్చారు. స్వామివార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

**రథోత్సవం**

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ఉపాలయం శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ముగింపు సందర్భంగా గురువారం స్వామివార్ల రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు రామలింగేశ్వర స్వామివార్లను ప్రత్యేక వాహనంలో డప్పు వాయిద్యాల నడుమ జాతీయరహదారిపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఈఓ ప్రియాంక మాట్లాడుతూ రామలింగేశ్వస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

గన్నవరం రూరల్: ముస్తాబాద కొండపైనున్న భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. తొలుత ఆలయం వద్ద ప్రత్యేక వాహనంపై ఉత్సవ మూర్తులను మేళతాళాలతో ఊరేగించారు. దక్షిణ బజార్, గాంధీబొమ్మ సెంటర్, కురవలి, మెయిన్ బజార్ తదితర ప్రాంతాల్లో భక్తుల కోలాహలం మధ్య స్వామివారి గ్రామోత్సవం కొనసాగింది. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రామవరప్పాడులో రథోత్సవం


యనమలకుదురులో గ్రామోత్సవం

# కాంట్రాక్టర్ల అవతారమెత్తిన పచ్చనేతలు!

- ఉపాధి పనులే టార్గెట్
- మండలంలో రూ 7.65 కోట్ల పనులు

పెనమలూరు: పచ్చనేతలు కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. దీంతో అధికారులు తలపట్టుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు పనులు కల్పించడమే కాకుండా రోడ్లు, డ్రైనేజీలు ఇతర కనీస మౌలిక వసతులు కల్పించడానికి మహాత్మగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్(ఎంజీఎస్ఆర్‌ఈజీఎస్) కింద మండలానికి రూ 7.65 కోట్లకు పైగా నిధులు (ఉపాధి పనులకు) మంజూరు చేసింది. మండలంలో 37 పనులు చేపట్టడానికి అంచనాలు వేశారు. ఇందులో సిమెంట్ రోడ్లు 33, బీటీ రోడ్లు 2, డ్రైనేజీలు 2 చొప్పున నిర్మాణం చేయాల్సి ఉంది. అయితే కాసులు కూడబెట్టుకునే పనిలో ఉన్న పచ్చగద్దలు ఉపాధి పనులపై వాలిపోయారు. వారు అధికారికంగా రికార్డుల్లో ఎక్కడా దొరకుండా ఉపాధి పనులు చేపట్టారు.


పచ్చనేతలు వేసిన 'ఉపాధి' సీసీ రోడ్లు

### గ్రామాల్లో పనులు ఇవే

చోడవరంలో 8 పనులు రూ.1.99 కోట్లు, గోసాలలో 5 పనులకు రూ.82 లక్షలు, గంగూరులో ఒక పనికి రూ.45 లక్షలు, పెదపులిపాకలో 9 పనులకు రూ.2.55 కోట్లు, పెనమలూరులో 8 పనులకు రూ.1.68 కోట్లు, వణుకూరులో 6 పనులకు రూ.55 లక్షల చొప్పున కేటాయించి పనులు మొదలు పెట్టారు. పచ్చనేతలే నేరుగా ఉపాధి పనులు చేయటంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అధికారులకు తలనొప్పి

పచ్చ నేతలు ఇంజినీరింగ్ శాఖ అధికారుల ప్రమేయం లేకుండా పనులు చేస్తుండటంతో పనులు నాణ్యతపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు నోరు మెదపలేని పరిస్థితి ఏర్పడింది.

### బిల్లుల కోసం హైరానా

పచ్చనేతలు గ్రామాల్లో వాలి ఉపాధి పనులు చేపట్టిన తరువాత మొదట్లో ప్రభుత్వం నుంచి బిల్లులు వెంటనే విడుదలయ్యాయి. అయితే ఇప్పుడు బిల్లులు రాకపోవడంతో పచ్చ కాంట్రాక్టర్లు హైరానా పడుతున్నారు.

బిల్లులు పెండింగ్‌లో ఉండటం కారణంగా ఇంకా రూ 3.50 కోట్లు ఉపాధి పనులు ప్రారంభించలేదు. పచ్చ నేతలు మాత్రం ప్రతిరోజు తమ బిల్లులకు ప్రభుత్వం ఎప్పుడు బటన్ నొక్కుతుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. సాంకేతిక కారణాలతో బిల్లులు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

### పేదలకు సేవలందించడమే లక్ష్యం

పాయకాపురం(విజయవాడరూరల్): పేదలకు సేవలందించడమే లక్ష్యంగా ఆజాద్ ముస్లిం కమిటీ పని చేస్తోందని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. 60వ డివిజన్‌కు చెందిన పేద ముస్లిం మహిళ చిరు వ్యాపారం చేసుకునేందుకు తోపుడు బండిని గురువారం కండ్రికలో అందజేశారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ.. గత 38 నెలలుగా పేద ముస్లిం, మైనార్టీలకు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. పేదలకు సేవా చేయాలనుకునే వారికి కమిటీలో సభ్యత్వం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా షేక్ సాజిద్ అలీ, ఉపాధ్యక్షుడు నాగుల్‌మీరా, రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ మౌలాలి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా, నగర ఉపాధ్యక్షుడు షేక్ సైదులు, 58, 61, 62, 64 డివిజన్ల అధ్యక్షులు, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ముగ్గురు రక్తదానం

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లికి చెందిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు మరోసారి మానవత్వం చాటారు. అపదలో ఉన్న ఓ యువతికి సకాలంలో రక్తదానం చేసి ఆమె ప్రాణాలను కాపాడారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన 18 ఏళ్ల రాపాక సౌజన్య గుండె సంబంధిత సమస్యతో చిన్నఅవుటపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రిలో చేరింది. ఆమెకు 'ఓ పాజిటివ్ 'రక్తం అత్యవసరం కావడంతో ఆమె కుటుంబ సభ్యులు యువజన సంఘానికి చెందిన బాపట్ల అనిల్‌ను సంప్రదించారు. దీంతో సంఘ సభ్యులు పిల్లి సునీల్, బాపట్ల సురేష్, అంబటి రత్నకిరణ్ స్వచ్ఛందంగా ఆస్పత్రికి వెళ్లి అమెకు రక్తదానం చేశారు.